క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


శ్రీతేజ స్వరూప్

పీఎం పాలెం : ఓ యువకుడు అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మిథిలాపురి ఉడా కాలనీ గాంధీ సెంటర్‌లో టైలర్‌గా పనిచేస్తున్న ఆలపాటి కోటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు శ్రీతేజ స్వరూప్ పదో తరగతి వరకూ చదువుకున్నాడు. దీర్ఘకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. దీంతో యువకుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మాజీ సీఎం బుద్ధదేవ్‌కు నివాళి


చిట్టివలసలో బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు చిట్టివలసలో శుక్రవారం నివాళులర్పించారు. సిటు కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడారు. బుద్ధదేవ్ మరణం పార్టీకి, బెంగాల్ ప్రజలకు తీరని లోటన్నారు. నిరాడంబర జీవితం గడుపుతూ కార్మికులు, పేద ప్రజల మేలు కోసమే జీవితమంతా కృషి చేశారన్నారు. పలువురు రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచిన బుద్ధదేవ్ కమ్యూనిస్ట్ పార్టీకి చివరి వరకు సేవలు అందించారన్నారు. సంతాప సభలో రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి, ఎస్.అప్పలనాయుడు, ఆటో, ముఠా, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సన్యాసినాయుడికి అభినందనలు


సన్యాసినాయుడు

భీమునిపట్నం : విజయవాడలో రెండు రోజుల క్రితం జరిగిన ఆంధ్రప్రదేశ్ బీసీ వసతి గృహ సంక్షేమ సంఘం ఎన్నికల్లో భీమిలిలోని బీసీ బాలుర వసతి గృహ వార్డెన్ పెంకోట సన్యాసినాయుడు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆయనకు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ తమకు ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు


ప్రధాన రోడ్డు మీద వేసిన నల్లపిక్క

కొమ్మాది : నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే విశాఖ – భీమిలి బీచ్‌రోడ్డుపైనే కొందరు నిర్మాణ సామగ్రి వేసి పనులు చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి మార్గంలో రుషికొండ ఐటీ జంక్షన్ సమీపంలో ప్రధాన రహదారిపైనే నిర్మాణ సామగ్రి వేసి పనులు చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎందుకీ తాత్సారం..?

- రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- విక్రయాల ప్రారంభానికి రైతుల ఎంపిక కూడా పూర్తి
- ఎన్నికల కోడ్ రావడంతో అమ్మకాలు ప్రారంభం వాయిదా
- కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా అటువైపు చూడని అధికారులు


రైతుబజారులో నిరుపయోగంగా దుకాణాలు


ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన చిట్టివలస రైతుబజారు


ఆకతాయిలకు అడ్డాగా రైతుబజారు పరిసరాలు

తగరపువలస : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్నట్లుంది భీమిలి నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన చిట్టివలస – తగరపువలస ప్రాంత ప్రజల పరిస్థితి. ఇక్కడి ప్రజల 40 ఏళ్ల నాటి రైతుబజారు కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. రైతులు, వినియోగదారుల సౌకర్యార్థం స్థానిక సత్యనారాయణపేట వాలు ప్రాంతంలో రూ.78 లక్షలతో రైతుబజారును నిర్మించారు. ఈ ఏడాది ఎన్నికల ముందు అప్పటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బజారును ప్రారంభించారు కూడా. తర్వాత సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో పాక్షికంగా ఆవరణలో చేపట్టాల్సిన ప్లాట్‌ఫారం పనులు నిలిచిపోయాయి. రైతుల ఎంపిక కూడా పూర్తయిందని... పార్కింగ్ స్థలంలో టైల్స్ వేసి రైతులతో విక్రయాలు ప్రారంభింపచేస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు అప్పట్లోనే ప్రకటించారు. అనంతరం ఎన్నికలు జరిగిపోయి, ప్రభుత్వం మారిపోవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులతోపాటు కొత్త ప్రభుత్వం కూడా రైతు బజారుపై శీతకన్ను వేసింది. రైతుబజారు కల సాకారమై ఆరు మాసాలు పూర్తయినా ఇక్కడి వినియోగదారులు, రైతుల కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. ఫలితంగా రైతులు తమ పంటను స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో దళారీల బెడదతో లభించిన ధరకు విక్రయించి నష్టాల పాలవుతుండగా... రిటైల్ వ్యాపారులు చెప్పిన అధిక ధరలకు వినియోగదారులు కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసుకుంటూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. విశాఖ, విజయనగరం రైతుబజార్లు, ఆనందపురం కూరగాయల మార్కెట్ కంటే స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో దళారులు కూరగాయలకు అదనంగా కిలోకు రూ.10 నుంచి రూ.20 వసూలు చేస్తున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా రైతుబజారు

రైతుబజారులో రూ.78 లక్షలతో 47 కూరగాయల దుకాణాలు, 10 ప్రావిజనల్స్ స్టోర్లు, టాయిలెట్లు నిర్మించారు. అయితే ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దుకాణాలను మందుబాబులు అడ్డగా చేసుకున్నారు. చుట్టుపక్కల వ్యాపారులు బజారు పరిసరాలను తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వ్యాపారులు, వినియోగదారుల అవసరాలకు నిర్మించిన టాయిలెట్లు బజారు చుట్టుపక్కల వ్యక్తులు వినియోగించుకుంటున్నారు. రహదారి వైపు నిర్మించిన ప్రావిజనల్స్ స్టోర్లను బయటి వ్యక్తులు గిడ్డంగులుగా వినియోగించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

వెంటనే విక్రయాలు ప్రారంభించాలి



చిట్టివలసలో రైతుబజారు ఏర్పాటు చేస్తారన్న ఆశలు చనిపోయిన వేళ... గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో 40 ఏళ్ల కల ఫలించింది. కొత్తగా నిర్మించిన బజారులో వెంటనే విక్రయాలు ప్రారంభిస్తే కూరగాయలు, ఆకుకూరలు వినియోగదారులకు చౌకగా అందుబాటులోకి వస్తాయి. ప్రైవేట్ మార్కెట్ వద్ద మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కారమవుతుంది.

– అలుగోలు సంతోష్, వినియోగదారుడు

రైతు బజారును నిర్వీర్యం చేయొద్దు



రైతుబజారు వస్తే కూరగాయలు, ఆకుకూరలు చౌకగా లభిస్తాయని ఈ ప్రాంత వినియోగదారులు ఎన్నాళ్లగానో ఆశగా ఎదురు చూశారు. మరోవైపు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతులే కాకుండా భోగాపురం, డెంకాడ మండలాల రైతుల శ్రమకు కూడా తగిన ఫలితం దక్కుతుంది. ఏ లక్ష్యంతో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు బజారు నిర్మించారో ఆ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు నెరవేర్చాలి.

– చేట్ల నరసింగరెడ్డి, వినియోగదారుడు

వేములవలస కూడలిలో అడ్డదిడ్డంగా ఆటోలు


వేములవలస మార్కెట్ కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా నిలిపిన ఆటోలు

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ కూడలిలో ఇష్టారాజ్యంగా ఆటోలు నిలిపివేయడంతో ట్రాఫిక్ కష్టాలు అధికమవుతున్నాయి. ఇప్పటికే వ్యాపారులు వేములవలస – ఆనందపురం రహదారిని ఆక్రమించడంతో ప్రారంభమైన కష్టాలు ఆటోల పార్కింగ్‌తో మరింతగా పెరిగాయి. ఉదయం వేళ ఆటోలు తీసుకొచ్చి బస్సులు ఆగేచోట నిలిపివేయడంతో ముందుకు సాగడం లేదు. మార్కెట్‌కు దూరంగా ఆటోలు నిలిపేలా ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన కుప్పలుగా డెబ్రిస్


గాయత్రి ఆస్పత్రి ఎదురుగా డెబ్రిస్

తగరపువలస : జీవీఎంసీ 5వ వార్డు గాయత్రి ఆస్పత్రి ఎదురుగా ఓజోన్ వ్యాలీ రోడ్డు పొడవునా ఇరువైపులా డెబ్రిస్ కుప్పలుగా పడి ఉంది. దీంతో ఈ ప్రాంతంలో పర్యావరణానికి హాని కలుగుతోంది. డెబ్రిస్ నుంచి ఎగిరిపడుతున్న దుమ్ము, ధూళి కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి డెబ్రిస్ తొలగించడంతోపాటు ఎవరూ ఈ ప్రాంతంలో డెబ్రిస్ వేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ర్యాంపు శిథిలం కావడంతో రాకపోకలకు అవస్థలు


బాందేవుపురంలో శిథిలమైన ర్యాంపు

పద్మనాభం : మండలంలోని బాందేవుపురం ఎస్సీ కాలనీ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా ఉండే సిమెంటు ర్యాంపు శిథిలమైంది. దీంతో ప్రయాణికులు దీనిపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా పద్మనాభం మండలం బాందేవుపురం, విజయరాంపురం, గంధవరం, కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, విజయనగరం జిల్లా జామి మండలం అలమండ, కొత్తవలస ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ర్యాంపు శిథిలమైన ప్రాంతం వద్ద లోతట్టుగా వుండడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. వర్షాల సమయంలో ఇక్కడ జలమయమై మార్గం కనిపించక వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ర్యాంపు శిథిలమై రెండేళ్లవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా శిథిలమైన ర్యాంపు ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

సరకు రవాణా వాహనాలతో ట్రాఫిక్ చిక్కులు


సంతపేట రెడ్డివీధిలో రెండు వ్యాన్‌లను అడ్డంగా పెట్టడంతో నిలిచిపోయిన కారు, ద్విచక్ర వాహనాలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో పలుచోట్ల ఇరుకైన రహదారులపై స్థానిక వ్యాపారులు పెత్తనం చెలాయిస్తున్నారు. నివాసాల మధ్య గొడౌన్లు నిర్మించి పగలు, రాత్రి తేడా లేకుండా తమ వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి సరకులు లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు రోడ్లపై రాకపోకలు సాగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. పోలీసుల నిబంధనల ప్రకారం సరకు రవాణా వాహనాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు పట్టణంలోకి ప్రవేశించకూడదు. దీనిని ఉల్లంఘిస్తూ వ్యాపారులు నిత్యం భారీ వాహనాలతో రోడ్లను ఆక్రమించేస్తున్నారు. దీంతో అంబులెన్స్, రేషన్, అగ్నిమాపక శకటాలు, పోలీస్ వాహనాలు కూడా ఈ అడ్డంకులను దాటలేకపోతున్నాయి. ప్రజల దినచర్యకు ఆటంకం కలిగిస్తున్న ఇలాంటి వ్యాపారులపై పోలీసులు దృష్టి సారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ నిర్మించి.. అవుట్‌లెట్ మరిచారు..


చిట్టివలస పోలమ్మ ఆలయం వద్ద అవుట్‌లెట్ లేకుండా నిర్మించిన డ్రైనేజీ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసలో ఇటీవల డ్రైనేజీ నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులు దానికి అవుట్‌లెట్ ఏర్పాటు చేయడం మరిచిపోయారు. దీంతో మైదాన ప్రాంతంలో కురిసిన వర్షం నీటితో ఈ డ్రైనేజీ నిండిపోతోంది. చుట్టుపక్కల నివాసాల వాడుక నీరు బయటకు వెళ్లేందుకు చాలా వరకు పైప్‌లైన్ ద్వారా డ్రైనేజీకి అనుసంధానం చేశారు. కానీ నిండిన డ్రైనేజీ నుంచి వర్షం నీరు తిరిగి వారి ఇళ్లలోకే వెనక్కు రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దీనిని ఆనుకుని చిట్టివలస పెద్ద చెరువు ఉంది. ఇందులో ఎక్కువైన నీరు బొగ్గురోడ్డు మీదుగా డ్రైనేజీలోకి చేరితే దిగువ ఉన్న ఇళ్లతోపాటు రహదారులు మునిగిపోవడం ఖాయమంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీకి అవుట్‌లెట్ ఏర్పాటు చేసి తమ ఇళ్లను ముంపు బాధ నుంచి తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వసతుల కల్పనతోనే సమర్థంగా విధుల నిర్వహణ

- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి
- పోలీస్ సిబ్బందికి నూతన కిట్ బాక్సుల అందజేత


మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్‌బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్స్‌లు అందజేత, మరుగుదొడ్లు పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఎక్కడ పని ఉంది? ఏమేం కావాలో తెలియజేస్తే ఆ ప్రకారం ఆయా పనులు చేయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. తన నంబర్ 7995095799కు తెలియజేసిన కిట్‌బాక్స్, మరుగుదొడ్లు, హ్యాండ్ కఫ్స్, వెహికల్ పార్కింగ్‌కు షెడ్లు, విశ్రాంతి కోసం మెన్ వెయిటింగ్ హాల్, ఇలా అన్ని సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే ముద్దాయిల ఎస్కార్ట్ విధులకు తగ్గించాలన్న సిబ్బంది విజ్ఞప్తిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కచ్చితంగా అవసరమైతే తప్పా మిగిలిన అన్ని సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముద్దాయిలను ప్రొడ్యూస్ చేసే విధానం పరిశీలించాలని అభ్యర్థన లేఖను ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించారు. తమ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు


ప్రత్యేక అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ : శ్రావణ శుక్రవారం సందర్భంగా చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా చంద్రంపాలెం ప్రాంతానికి చెందిన దివంగత పిళ్లా కృష్ణస్వామి పాత్రుడు కుమారులు రామలక్ష్మణులు, పిళ్లా రమణమూర్తి కుమారుల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేశారు. ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా శ్రీనివాసరావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పిళ్ల చిన సన్యాసిరావు, దుక్క వరం పాల్గొన్నారు.

పద్మనాభం : శ్రావణ శుక్రవారం సందర్భంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీ దేవి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. కృష్ణాపురం, మద్ది, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, విలాస్కాన్‌పాలెం గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పద్మనాభం : మద్ది గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన దంపతులు పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి కనకల అప్పలరాజు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అష్టలక్ష్మి హోమం

కొమ్మాది : శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మి ఆలయాల్లో అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీ లక్ష్మీ నారాయణులకు వెండి కవచధారణ చేసి సుప్రభాత సేవ అనంతరం హోమం నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకుని గరుడాళ్వార్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర్ స్వామి తెలిపారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి ఆధ్వర్యంలో విశేష పారాయణ నిర్వహించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

తగరపువలస : ఆనందపురం మండలం బాకురుపాలెం సర్వే నంబర్ 3 బోడి మెట్ట కొండపై ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రైతులు వేసిన మొక్కలను తొలగించిన చోట తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రైతులు ప్రభుత్వ స్థలంలో నాటిన మామిడి, నీలగిరి మొక్కలను రెండో రోజు కూడా వీఆర్వోలు, వీఆర్ఏల సాయంతో తొలగించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస : ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. వేములవలస పారిశ్రామిక ప్రాంతం, పెద్దిపాలెం, వెల్లంకి, బొడ్డపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలని వినతి

మధురవాడ : జీవీఎంసీ 5 వార్డులో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను కార్పొరేటర్ మొల్లి హేమలత శుక్రవారం కలిసి విన్నవించుకున్నారు. వార్డులోని హుద్‌హుద్ కాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టులు, రోడ్లు, సాయిరాం కాలనీ, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ : బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మధురవాడ : పీఎం పాలెం ఆర్‌హెచ్ ముస్లిం కాలనీలో మానసిక ఒత్తిడితో షేక్ బీబీ (57) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా నివసిస్తున్న బీబీ కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు భర్త సన్యాసిరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

బావిలో పడి వ్యక్తి మృతి

కొమ్మాది: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బావిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలివీ.. పూర్ణామార్కెట్‌కు చెందిన కాకర అప్పారావు (41) వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఊరు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఓజోన్ వ్యాలీ రోడ్డు దరి ఓ బావిలో విగత జీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో పీఎం పాలెం పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.